కథానిక



# చూపులు కలిసిన శుభవేళ

— సంగంబండ జగన్నాథరెడ్డి

తనకి లీజర్ పీరియడ్ కావడంతో స్టాఫ్‌రూమ్‌లో కూర్చుని పేపర్ తిరగేస్తున్నాడు లెక్చరర్ కరుణాకర్. ఆవైపే వచ్చి ఎదురుగా కూర్చున్న మెరుపుతీగ లాంటి అమ్మాయిని చూసి చూడనట్టు చూశాను. ఆమె కూడా సరిగ్గా అతడు తనవైపు చూస్తున్న వేళన క్షణకాలంపాటు చూపు నిలిపి తలదించి టేబుల్‌పై వున్న వీక్లీని అందుకుని తిరగేయసాగింది. ప్రభుత్వ కాలేజీలో మొదటే లెక్చరర్ల కొరత వుండడంతో మిగతా స్టాఫ్ అంతా క్లాసులు తీసుకుంటూ వుండడం చేత ఆ యువమిథునం మాత్రమే స్టాఫ్‌రూమ్‌లో వుండిపోయారు. కొత్తకోట చేనేత చీర, బ్లౌజుతో ఆకట్టు, బొట్టు తీరులో సంప్రదాయబద్ధమైన కుటుంబ స్త్రీలా వుందామె. ఆ ఇరువురు చూసుకొన్నది క్షణకాలమే అయినా వాండొరులకు ఒకరి రూపం మరొకరికి నచ్చింది లవ్ ఎట్ ఫస్ట్‌సైట్ అంటే అదేనేమో మరి!

ఆ ఇద్దరిలోనూ మాటలెలా కలుపాలనే ఆతురత వుంది.

'మీరీ కాలేజీకి ఎప్పుడొచ్చారు' చొరవ తీసుకుని అడిగాడు కరుణాకర్.

'నిన్నే బయాలజీ లెక్చరర్‌గా జాయిన్ అయ్యాను'

'మీ పేరు'

'చందన'

'నైస్‌నేమ్'

ఆమె అడగకుండానే తన పేరు కరుణాకర్ అని తెలుగు లెక్చరర్నని పరిచయం చేసుకున్నాడు. అతడి కలుపుగోలు తనానికి ఆమె చిన్నగా నవ్వుకొంది. యువజంటలకు పరిచయవాక్యాలు కల్పిస్తే చాలు.ఇక మాటల కొరతే వుండదు. క్రికెట్, సినిమా, దేశరాజకీయాలు, నేతల స్కామ్‌లు, మిస్‌యూనివర్సల్ ఒకటేమిటి ప్రపంచమే చుట్టి వేస్తారు. సంభాషణల్లో వారికి కాలమే తెలిసి రాలేదు. కొత్తవారమన్న భావనే కలుగలేదు. బెల్‌కొట్టడంతో అప్పుడే నలభై అయిదు నిమిషాలు గడిచాయా అనుకుంటూ ఒకరినొకరు చూపులతోనే మళ్ళీ కలుద్దాం అన్నట్టు చూసుకొంటూ క్లాసులుండడంతో ఎవరి క్లాసులోకి వారెళ్ళిపోయారు.

ఆ ఇరువురికి లీజర్ పీరియడ్స్ కాకతాళీయంగా ఒకేసారి వుండడం వల్ల స్టాఫ్‌రూంలో ఇరువురు అరమరికల్లేకుండా మాట్లాడుకునేవారు. అటెండర్ చేత కాఫీలు తెప్పించుకుని తాగడం మీరు అన్న సంబోధన స్థానంలో నువ్వు అని పిలుచుకోవడం ఒకరు జోకులేస్తే మరొకరు విరగబడి నవ్వడమే కాదు, రోజూ ఒకర్నొకరు చూసుకోనిదే వుండలేని స్థితికి వచ్చింది వారి పరిచయం. తల్లిదండ్రి రెండేళ్ళ నుంచి పెళ్ళిచేసుకోమని చెవినిల్లుగట్టుకొని చెప్పినా పెళ్ళికిప్పుడేమి తొందరఅంటూ వచ్చాడు కరుణాకర్. తల్లిదండ్రిలేని చందన పెళ్ళి చేసి తమ బాధ్యత దింపుకోవాలని అన్నావదినలు ఒకటే పోరు పెడుతున్నారు. ఉద్యోగం దొరికాక చేసుకుంటానని చెబుతూ వచ్చిన చందనకు ఇక వారికెలా చెప్పాలో బోధపడడం లేదు.

జీవితకాలం కలిసి బతికే వారుకేవలం ఐదు, పదినిమిషాల పూర్వపరిచయం లేని పెళ్ళిచూపుల తతంగంతో ఒకరి అభిరుచులు, ఆశయాలు మరొకరికెలా తెలుస్తాయి. అంతేకాదు ఒకరితో పాటు మరొకరికెలా అర్థం అవుతాయన్నది చందన భావన. ఎదుటి వ్యక్తిని అర్థం చేసుకుని వారి అభిప్రాయాలకు విలువ ఇచ్చేవ్యక్తినే కట్టుకోవాలన్నది ఆమె తపన.

* * * *

మునిసిపల్ పార్కులో పచ్చనిగరికపై కూర్చుని వేరుశనక్కాయలు చందన వొలిచి పెడుతుంటే ఒకొక్కటి తింటూ 'చందనా! నిన్నిక్కడికెందుకు రమ్మన్నానో తెలుసా' అన్నాడు కరుణాకర్.

'చెప్పనిదే ఎలా తెలుస్తుంది కానీ నేనుకూడా నీతో ఓ విషయం చెప్పాలనే వచ్చాను సుమా'

'చెప్ప సంకోచం దేనికీ' అడిగాడు కరుణాకర్.

'మా అన్నయ్య రేపు అర్జంటుగా హైదరాబాద్ రమ్మని టెలిగ్రాం ఇచ్చాడు.ఉదయమే వెళ్తున్నాను'

'ఓస్.. ఇంతేనా? ఇంకేదైనా రహస్యం వుందేమో అనుకున్నా'

'నీకు చెప్పని రహస్యాలేముంటాయ్. సరే కానీ నన్నెందుకు పార్కుకు రమ్మన్నావ్'

'చందనా! మా నాన్న కూడా నన్ను వెంటనే బయలుదేరి రమ్మని కబురుపెట్టారు. ఎల్లుండి పెళ్ళిచూపులకు వెళ్ళాలట'

'శుభస్య శీఘ్రం వెళ్లిరా!' అంది నిష్ఠూరంగా.

'మా అమ్మానాన్నల పోరుపడలేక వెళుతున్నాను. వెళ్ళి అమ్మాయి నచ్చలేదని చెబుతాలే'

'కోరిన కట్నంతో పాటు అమ్మాయి కుందనపు బొమ్మైతే తలవొగ్గుతావేమో' ఉడికించాలని అంది చందనా.

'చందనా నన్నింతేనా అర్థం చేసుకున్నది. నన్ను బంగారంతో తులాభారం చేసేంత కట్నం ఇచ్చిన అమ్మాయి అప్సరసలా వున్నా నా మనసు మారదు డియర్' అంటూ ఆమె చేతిపై సున్నితంగా ముద్దు పెట్టుకున్నాడు.

ఆమె అతడి నుదుటిపై చుంబిస్తూ ఈ తీయని ముద్దు సాక్షిగా నువ్వే నా రాజావు ప్రియా అంది. అప్పటికే రాత్రి ఏడు గంటలు కావడంతో చీకటి అలుముకుంటుండడం చేత ఇద్దరూ లేచి తమ తమ రూములకు వెళ్ళిపోయారు.

* * * *

సోఫాలో కరుణాకర్ అతని మిత్రుడు జయశంకర్ కూర్చోగా పక్క సోఫాలో అమ్మాయి అన్న రామానుజం కూర్చున్నాడు. కరుణాకర్ తనకు అమ్మాయి నచ్చితే మీరెళ్ళి ఖరారు చేసుకొద్దురులెండి అని తల్లిదండ్రులకు చెప్పి పెళ్ళి చూపులకు మిత్రుడితో వచ్చాడు. తల్లితండ్రి వెంట తీసుకుని వస్తే అమ్మాయి బాగుందని వొప్పేసుకొమ్మని వొత్తిడి చేస్తారని స్నేహితుడితో వచ్చాడు. ఈసంబంధం వచ్చలేదని తన లవ్‌స్టోరీ ఆ తర్వాత కన్న వారికి తెలిపి పెళ్ళికి వొప్పించాలని అతడి ఉద్దేశం.

అమ్మాయిని తీసుకు రమ్మని తన భార్య వనజకు రామానుజం చెప్పి ఐదు నిముషాలైనా అమ్మాయి రాలేదు.

'ఏరా అమ్మాయి ఇంకా రాలేదు. ఆమెకు కూడా ఈ పెళ్ళి ఇష్టం లేదా ఏమి' మెల్లగా మిత్రుడితో అన్నాడు జయశంకర్.

'అయితే మరి మంచిదే. మనం త్వరగా వెళ్ళవచ్చు'

వాళ్ళు గొణుక్కుంటున్నది చూసి ఆలస్యానికి కారణం తెలుసుకునేందుకు ఇంట్లోవెళ్ళేందుకుకుద్యుక్తుడవుతుంటే అమ్మాయిని వెంట పెట్టుకుని వనజ వచ్చింది.తల కాస్త పైకెత్తి నడవమని వనజ చెబుతున్నా ఆ అమ్మాయివంచిన ,తలయెత్తకుండా మెల్లిగా వస్తోంది.

'అమ్మాయి బంగారు బొమ్మరా. కాస్త తలపైకెత్తి చూడరా' అని మిత్రుడు చెవిలో మెల్లగా చెప్పినా కరుణాకర్ అవైపే చూడలేదు. తను ఏ నుముహూర్తంలో చందన చూపుల్లో చూపు కలిపాడో ఆక్షణమే తన మనసు పరాధీనమైంది. ఇంకా పెళ్ళి చూపులెందుకని అమ్మాయి వైపు చూసేందుకు అతని మనసు ససేమిరా ఒప్పకోవడం లేదు.

వారి కెదురుగా సోఫాలో పెళ్ళికూతురు వచ్చి కూర్చుందే కానీ తలపై వేసుకున్న ముసుగు తీయలేదు.

'అమ్మా మర్యాదకైనా కొంచెం తల ఎత్తి చూడమ్మా. వచ్చిన వారివైపు నగుమోము చూపమ్మా' వనజ వేడుకోలుగా అంది.

'సరే వదిన' అంటూ ఆమె తల పైకెత్తింది.

ఆమె కళ్ళు మెల్లకళ్ళులా వుండడం చూసి మిత్రుడి కోరిక నెరవేరుతోందని 'అమ్మాయి మెల్లకళ్ళదిరా. నువ్వు తేరిపార చూసినట్టు నటించు. మనం త్వరగా వెళ్ళవచ్చు. బ్రతిమాలుతున్న ధోరణిలో అన్నాడు జయశంకర్.

మిత్రుడి కోరిక మన్నించి తల పైకెత్తి పెళ్ళికూతురిలా ముస్తాబైన అమ్మాయివైపు చూశాడు.

అంతే.. అమ్మాయి మెల్లకళ్ళు చక్కనై అల్లనేరేడుపళ్ళలా అగుపించాయి.

ఆమె చూపులో చూపుకలిపి 'చందూ..' ఆప్యాయంగా పిలిచాడు కరుణాకర్.

'మా చందన మీకు ముందే తెలుసా?'

రామానుజం మాట పూర్తికాకుండానే 'చందన మా కొలీగ్. మా మనసులు కలిసాయి. పెళ్ళిచూపులింకెందుకు లెండి'

చందన కళ్ళు ఆనందంతో వర్షించాయి. పట్టలేని సంతోషంతో కాఫీ పట్టుకొస్తానని ఇంట్లోకి వెళ్ళిపోయింది.

'ఏరా. పెళ్ళిచూపుల్లో అమ్మాయి నచ్చలేదని మీ వారితో చెబుదామా?' ఎగతాళిగా అన్నాడు జయశంకర్.

'వెంటనే ముహూర్తం పెట్టించమని చెప్పాలిరా! అదికూడా కానీ కట్నం లేకుండా పెళ్ళి చేసుకుంటా సుమా!'

ఆ మాట విని వనజ, రామానుజం చందన అదృష్టజాతకురాలని పూర్వజన్మలో చేసుకున్న సుకృతమే అని మురిసిపోయారు.

ట్రేలో కాఫీకప్పలతో వచ్చిన చందన కరుణాకర్‌కు కాఫీ అందిస్తూ కళ్ళతోనే నవ్వింది. తమ పెళ్ళిచూపుల తంతు సుఖాంతంగా ముగిసి కళ్యాణఘడియ దాపురిస్తున్నందుకు ఆ ఇద్దరు లోలోన నవ్వుకున్నారు. ఇది కేవలం వంతుకు నిర్వహించిన పెళ్ళిచూపుల తంతుఅని తొలి చూపుల కలయికే పెళ్ళిచూపులని తమ చూపులు కలసిన శుభవేళ దృశ్యాన్ని మరోమారు నెమరువేసుకున్నారా ఇద్దరు హృదయతెరపైన.



## నానా నార్త్—
## ఎస్ ఎస్ సౌత్

'ఏమాట కామాటే చెప్పకోవాలి. సౌత్ ఇండియన్ దర్శకుల్లో వున్న ఫ్రాంక్‌నెస్ నార్త్ ఇండియన్స్‌లో లేదు. ఉదాహరణ సంజయ్ భన్సాలీ. అతగాడు ఖామోషీ చిత్రం నాతో తీస్తా తీస్తా అని చివరికి మనిషాని పెట్టి తీశాడు. నా ఇమేజ్ ఏంకావాలి? అందుకే ఆయన చిత్రాల్లో ఇక నటించను. అలాగే నా కిష్టమైన దర్శకుడు బాపు, శ్రీ కె.విశ్వనాథ్ గార్లు. బాపుగారి ప్రేమ్ ప్రతిజ్ఞ, కె.వి.గారి 'సంగీత్' చిత్రాలు జీవితంలో మరచిపోలేని కళాఖండాలు అంటూ మాధురి దీక్షిత్ కితాబునిచ్చింది.




